# కాంగ్రెస్ ధ్యాసంతా ప్రచారంపైనే


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కొండల్‌రెడ్డి

- ఆరు గ్యారెంటీల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీలో కొత్తదనమేమీ లేదు
- కేసీఆర్ హయాంలో ఆరోగ్యశ్రీ లోనే పేదలకు ఎక్కువ ప్రయోజనాలు
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 13: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తదనమేమీ లేదని, ఆ పార్టీకి ప్రచారం మీద ఉన్న ధ్యాస ప్రజాసేవ మీద లేనట్లు ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాజీవ్ ఆరోగ్యశ్రీ కొత్త సీసాలో పాత మందు సామెతను తలపిస్తున్నదన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్భాటంగా ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఏ మాత్రం కొత్తదనం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రూ.10 లక్షలతో కూడిన ఆరోగ్యశ్రీ అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షలు, పీఎం ఆయుష్మాన్‌భవ కింద ఇస్తున్న రూ.5 లక్షలు కలిపి తామే రూ.10 లక్షల వైద్యసాయం చేస్తున్నట్లు ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం ఆయుష్మాన్‌భవ పథకం కంటే కేసీఆర్ హయాంలో ఆరోగ్యశ్రీలోనే రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎక్కువ ప్రయోజనాలు అందాయన్నారు. దానికితోడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా సాయం అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం, నిధుల కొరతను దాచి పెట్టడానికి పాట్లు పడుతున్నదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఈ పథకంపై స్పష్టతతో కూడిన జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందో ప్రజలకు తెలుపాలన్నారు. పెంచి ఇస్తామన్న రైతు బంధు డబ్బులు ఇవ్వకుండా గత కేసీఆర్ ప్రభుత్వం రైతుల పేర విడుదల చేసిన వాటినే అందిస్తూ తాము ఇచ్చినట్లు డబ్బా కొట్టుకోవడం సరికాదన్నారు. అలాగే తొలి కేబినెట్ భేటీలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాట ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిందని ఆయన విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, హుజూరాబాద్ సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై గుంతలను పూడ్చివేయాలి


శంకరపట్నం, డిసెంబర్ 13: జాతీయ రహదారిపై ప్రమాదకర గుంతలను పూడ్చి వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంకాయగూడెం, కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు మీదుగా జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని చెప్పారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు దేవునూరి భాస్కర్, ఎదురుగట్ల సంపత్ ఉన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి


ఇల్లందకుంటలో రైతుబంధు దరఖాస్తు స్వీకరిస్తున్న ఏవో రజిత

ఇల్లందకుంట, డిసెంబర్ 13: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బంధు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో గుర్రం రజిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుబంధు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్తగా భూములు కొనుగోలు చేసి పాసుపుస్తకాలు పొందిన వారు రైతు బంధుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫారంతో ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు జత చేసి తమ క్లస్టర్ రైతు వేదికలో ఏఈవోలకు అందజేయాలన్నారు. ప్రస్తుతం యాసంగిలో వివిధ పంటలు సాగు చేసుకుంటున్న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతు బంధు డబ్బులు జమచేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఏఈవోలు తిరుపతి, రాకేశ్, సంపత్, రైతులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్


వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేస్తున్న రవీందర్ రెడ్డి

చిగురుమామిడి, డిసెంబర్ 13: మండలంలోని సుందరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కరీంనగర్ అక్షర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సుందరగిరి పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎడబోయిన రవీందర్‌రెడ్డి రూ. 30వేల విలువైన వాటర్ ప్యూరిఫైర్, కంప్యూటర్ సీపీయూను వితరణ చేశారు. బుధవారం ప్రధానోపాధ్యాయిని పావనికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా దాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ సమకూర్చినట్లు తెలిపారు. సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జీల సంపత్ దాత రవీందర్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పావని, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలి


హుజూరాబాద్ టౌన్: నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 13: జనవరి ఒకటి నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న వారందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కే విజయ్‌కుమార్ సూచించారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ప్రచురణ, 1400 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పుల క్లెయిమ్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, ఓటర్ జాబితాలో తప్పుల సవరణకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించిందని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జనవరి 5లోగా కొత్త దరఖాస్తులను పరిశీలించి మార్పులు చేర్పులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆరో తేదీన ముసాయిదా జాబితా విడుదల, 22వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితాను జిల్లా ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తరపున కొలిపాక శ్రీనివాస్, కాంగ్రెస్ తరపున సొల్లు బాబు, బీజేపీ తరపున యాంసాని శశిధర్, టీడీపీ తరపున ఎస్‌కే ఫయాజ్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

### బీఎల్వోలతో తహసీల్దార్ సమావేశం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 13 :మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో బీఎల్వోల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి 18 ఏండ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. అలాగే మరణించిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ సమీన, వివిధ గ్రామాల బీఎల్వోలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరీక్ష ప్యాడ్ల వితరణ

చిగురుమామిడి, డిసెంబర్ 13: మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను వితరణ చేశారు. మొత్తం 22 మంది విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) పరీక్ష ప్యాడ్లను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోలాడి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు కానిగంటి రాజమౌళి, శ్యామయ్య, జ్యోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## శబరిమలకు పాదయాత్ర

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 13: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కాసగోని శ్రీనివాస్‌గౌడ్, పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన దొనికెన పూర్ణచందర్‌గౌడ్ పాదయాత్రగా కేరళలోని శబరిమలకు బయలుదేరారు. జనవరి 11న శబరిమల అయ్యప్పస్వామి సన్నిధికి చేరుకుంటామని, మొత్తం ఈ పాదయాత్ర 1400 కిలోమీటర్లు, ఐదు రాష్ట్రాల గుండా సాగుతుందని వారు తెలిపారు. కాగా, హుజూరాబాద్ నుంచి ఇద్దరు స్వాములు మహా పాదయాత్రగా వెళ్లడంపై హుజూరాబాద్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గురు స్వాములు హర్షం వ్యక్తం చేశారు.


రవాణాశాఖ కార్యాలయం వద్ద మంత్రి, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న ఆర్టీఏ అధికారులు

## మంత్రి, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం

తిమ్మాపూర్, డిసెంబర్ 13: బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంత్రి హోదాలో తొలిసారి బుధవారం కరీంనగర్‌కు రాగా, అధికారులు ఘన స్వాగతం పలికారు. తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్ద డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారులు మంత్రితోపాటు మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఎండీలో అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు మంత్రి, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, టీఎన్జీవోస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక కళాకారుల గ్రామ కమిటీ ఎన్నిక

వీణవంక, డిసెంబర్ 13: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో బుధవారం సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య నూతన కమిటీని హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు తాండ్ర శంకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పల్లె రాజమల్లు గౌడ్ (మాజీ ఎంపీపీ), అధ్యక్షుడిగా నాంపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా మాషబత్తుల మల్లయ్య, న్యాలి సంపత్, ప్రధాన కార్యదర్శిగా ఉడుత సదయ్య, ప్రచార కార్యదర్శిగా ఎలుక దేవాల్‌రెడ్డి, ఉప ప్రచార కార్యదర్శిగా న్యాలి సాంబయ్య, సంయుక్త కార్యదర్శులుగా మారముల్ల సమ్మయ్య, కూనరాజు సదానందం ఎన్నికైనట్లు డివిజన్ అధ్యక్షుడు తాండ్ర శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు వైఎస్ శర్మ ఆదేశాల మేరకు వల్భాపూర్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోళ్ల కొమురెల్లి, మండలాధ్యక్షుడు గడ్డం నారాయణ, ప్రధాన కార్యదర్శి గోనెల సమ్మయ్య, కార్యవర్గ సభ్యుడు దూలం సురేశ్, శంకరపట్నం, జమ్మికుంట మండలాధ్యక్షులు పడాల సత్తన్న, వేముల అశోక్, జిల్లా డైరెక్టర్ నర్సింగోజు రవీంద్రాచారి, మాజీ సర్పంచ్ మారముల్ల కొమురయ్య, వల్భాపూర్ గ్రామ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత


చిగురుమామిడిలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి, డిసెంబర్ 13: మండల కేంద్రంలో లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు వరంలా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, ఆర్ఐ పూదరి రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు. కాగా, మండలంలోని చిగురుమామిడితో పాటు సీతారాంపూర్, లంబాడి పల్లి, రేకొండ, ముల్కనూర్, రామంచ, ముదిమాణిక్యం, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, బొమ్మనపల్లి, సుందరగిరి, ఉల్లంపల్లి, నవాబ్ పేట్, కొండాపూర్ గ్రామాల్లో 46 మంది లబ్ధిదారులకు ఆర్ఐలు రాజు, శైలజతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.

## బాట సమస్యను పరిష్కరించిన ఎస్ఐ

సైదాపూర్, డిసెంబర్ 13: మండలంలోని సర్వాయిపేటలో ఎస్సీ కాలనీ నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారిలోని ఇండ్లు, రైతుల పొలాలకు సుమారు 30 ఏండ్లుగా సరైన బాట లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎస్ఐ ఆరోగ్యం ఆరోగ్యం దృష్టికి రావడంతో ఆయన ప్రత్యేక చొరవతో సమస్యను పరిష్కరించారు. బాట వేసేందుకు వీలున్న భూమి యజమాని రైతు కచ్చు ఐలయ్యతో ఎస్ఐ, గ్రామస్తులు మాట్లాడారు. గ్రామస్తులు, రైతులు బాటలేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, బాట కోసం భూమి ఇవ్వాలని తెలుపగా సదరు రైతు అంగీకరించాడు. దీంతో అతడిని ఎస్ఐ ఆరోగ్యం అభినందించారు. రైతు కచ్చు ఐలయ్య, గ్రామస్తులు ఎస్ఐని శాలువాతో సన్మానించారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత: నలుగురిపై కేసు

వీణవంక, డిసెంబర్ 13: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వచేసి, విక్రయిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కడమంచి యాదగిరి, ఉబిది నరేశ్, పస్తం అనిల్, పస్తం శ్రీనివాస్ తక్కువ ధరకు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొని, తిరిగి ఎక్కువ ధరకు వేరే వాళ్లకు అమ్ముతుండగా గ్రామ శివారులో పట్టుకొన్నారు. 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటిని తదుపరి చర్యల కోసం సివిల్ సప్లై డీటీకి పంపడంతోపాటు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న యాదగిరి, నరేశ్, అనిల్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇక్కడ ఎస్ఐ ఆసిఫ్‌తో పాటు తహసీల్దార్ తిరుమల్‌రావు, డీటీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.